# PITHAPUR RAJAH'S GOVERNMENT COLLEGE(A), KAKINADA

# BA 1ST SEMESTER

# GENERAL TELUGU

# SAHITYA SOWRABHAM

# 1.రాజనీతి

1. నారదుడు ధర్మరాజుకు చెప్పిన రాజనీతిని సంగ్రహంగా తెలుపండి.

జ. రాజు తన రాజ్యపాలన సజావుగా సాగాలంటే, ఈ క్రింది విషయాలపై దృష్టి సారించాలి.

1) రాజు ధర్మమునందే తన మనస్సు నిలిపి, చేయవలసిన రాజకార్యాలను స్వబుద్ధితో అర్ధరాత్రి దాటిన తర్వాతనే ఆలోచించాలి.

2) ప్రభుత్వోద్యోగాల్లో యోగ్యులను, వారి శక్తి సామర్థ్యాలను గుర్తించి, స్థిరంగా నియమించాలి.

3) పుణ్యాత్ముల్నీ, శాస్త్రవిధి తెలిసినవారినీ, రాజుపై ప్రేమగలవారినీ, వంశపారం పర్యంగా కొలువుచేస్తున్న బ్రాహ్మణుల్నీ తనకు మంత్రులుగా ఏర్పరచుకోవాలి.

4) ప్రజల చెవిన పడకుండా, రహస్యాలోచనను రక్షించుకోవాలి.

5) అనేక యుద్ధాల్లో విజయాలు సాధించిన నిపుణులను, నుంచి పరాక్రమం కలవారిని, నమ్మకస్థులను, రాజు మేలు కోరేవారిని, సేనాధ్యక్షులుగా నియమించుకోవాలి.

6) పన్నులు వసూలు చేసే ఉద్యోగులుగా, ధర్మపరీక్షలచే పరిశుద్ధులైనవారిని, నీతిమార్గంలో నడచుకొనేవారిని, సమబుద్ధితో వ్యవహరించేవారిని, నియమించాలి.

7) వ్యక్తుల యోగ్యతలను గుర్తించి, ఉత్తమ, మధ్యమ, అధమ ఉద్యోగాల్లో ఆ వ్యక్తులను నియమించాలి.

8) సేవకులకు తగిన జీతాలు సకాలంలో ఇవ్వాలి. మంచి సేవకులకు తగిన సత్కారం చెయ్యాలి.

9) రాజు కార్యభారం వహించటానికి, యోగ్యులను పంపాలి.

10) సేవకులు తనకు చేసిన మేలును గుర్తించి, మేలుచేసిన వ్యక్తుల్ని పెద్దలున్న సభల్లో రాజు సత్కరించాలి.

11) రాజు తనకు వచ్చే ఆదాయంలో, నాల్గవ వంతుగాని, మూడవ వంతుగాని, సగభాగం కాని మించి ఖర్చు పెట్టరాదు.

12) రాజు ప్రతిదినం మంత్రులతో, సైన్యాధిపతులతో, రాజకుమారులతో, పండితులతో కొలువుతీరాలి.

13) రాజు తనకు వెలుపల, లోపల ఉండే, శత్రువుల నుండి, తన్ను తాను రక్షించుకోవాలి. గూఢచారుల ద్వారా శత్రురాజుల ప్రవర్తనను, తెలిసికోవాలి.

14) రాజు, వార్తను నిర్వహించాలి..

15) రాజు, తన రక్షణలోని కోటలలో ధనధాన్యాలను, ధనుర్బాణాలను, యుద్ధ వీరుల్ని, నీటిని, పశుగ్రాసాన్ని, ఆహారపదార్థాలను, వంటకట్టెల్ని, సమృద్ధిగా సమకూర్చుకోవాలి.

16) రాజు శత్రువులపై దండెత్తటానికి ముందే, శత్రురాజుల మీద సామదానభేద దండోపాయాల్ని ప్రయోగించాలి.

17) రాజు, పదునాలుగు రాజ దోషాలను విడిచిపెట్టాలి.

...........

2. ఉద్యోగుల నియామకంలో రాజులు ఎటువంటి జాగ్రత్తలు తీసికోవాలి ?

ఉద్యోగుల నియామకంలో రాజులు తీసికోవలసిన జాగ్రత్తలను గూర్చి, నారదుడు ధర్మరాజుకు ఇలా చెప్పాడు.

ప్రభుత్వ ఉద్యోగాల్లో యోగ్యులైన వారిని, వారి శక్తి సామర్థ్యాలను గుర్తించి, రాజు గౌరవభావంతో స్థిరంగా నియమించాలి.

పురోహితుల అర్హతలు:- ధైర్యవంతుడూ, ధర్మాధర్మాలు తెలిసినవాదూ, వివిధ వేదశాస్త్రాలు బాగా చదువుకొన్నవాడూ, తాగద్వేషాలు లేని సమచిత్తుడూ, సరస్వతీ స్వరూపుడూ అయిన వ్యక్తిని, పురోహితునిగా రాజులు నియమించాలి.

యాజ్ఞికులు:- యాజ్ఞికుడు, యజ్ఞాన్ని చేయించడంలో నిపుణుడయి ఉండాలి. అతడు, రాగద్వేషాలు లేని సమబుద్ధితో తన కర్తవ్యాలను మరచిపోకుండా ఉండాలి.

సేనాధ్యక్షులు:-అనేక విధాలయిన యుద్ధాలలో విజయాన్ని సాధించడంలో నిపుణులూ, ఎదిరించ సాధ్యం కాని పరాక్రమం కలవాళ్ళూ, రాజునకు విశ్వాస పాత్రులయిన వారు, రాజు గారి మేలు కోరేవారు అయిన వారిని, రాజులు, సేనాధ్యక్షులుగా నియమించాలి.

ఆస్థాన జ్యోతిష్కులు :-రాజు ఆస్థానంలోని జ్యోతిష పండితులు, శాస్త్ర పాండిత్యము చేతనూ, తమ ప్రతిభ చేతనూ, దేవతా సంబంధాలూ, అంతరిక్ష సంబంధాలూ, భూ సంబంధాలూ అయిన ఉత్పాతాలను, ముందుగానే కనిపెట్టి వాటికి విరుగుడుగా శాంతి క్రియాదులు చేయించేవారయి ఉండాలి.

ఆయుర్వేద వైద్యులు :-రాజులు ఆయుర్వేద వైద్యంలో సమర్థులయిన వైద్యులను, నియమించుకోవాలి.

ఉద్యోగులు:- పన్నులు వసూలు చేసేటటువంటి ఉద్యోగులుగా ధర్మపరీక్షచే పరిశుద్ధులయినవారూ, పాపములేని బుద్ధ కలవారూ నీతిమార్గంలో నడచేవారూ, అయిన యోగ్యులను, రాజు చక్కగా పరీక్షించి నియమించాలి. వ్యక్తుల యొక్క ఉత్తమ, మధ్యమ, అధమ యోగ్యతలను తెలిసికొని, వారిని ఉత్తమ, మధ్యమ, అధమమైన ఉద్యోగాల్లో నియమించాలి. ధనము పట్ల లోభబుద్ధి కలవారినీ, దొంగలనూ, స్నేహానికి యోగ్యులు కాని వారినీ, శత్రువులపై పక్షపాతం

కలవారినీ ధైర్యం చాలని వారినీ, దుర్మార్గులనూ, రాజకార్యాలు చేయడానికి రాజు పంపరాదు.

ఆయుధశాలలు, ధనాగారాలు, అశ్వశాలలు, గజశాలలు, కోశాగారాలు అనే వాటి పాలనలో, ఎంతో నమ్మదగిన వారినీ, రాజు పట్ల భక్తి గలవారినీ, సమర్థులయిన వారినీ, ఉద్యోగులుగా రాజు నియమించాలి.

ఈ విధంగా రాజు సమర్థులయిన ఉద్యోగులను, నియమించడంలో జాగ్రత్తలు తీసికోవాలి.

................

3. ప్రజాపాలనలో రాజులు పాటించవలసిన ధర్మాలేవి ?

జె. రాజులు - ప్రజాపాలన :

1) రాజులు తమ సేవకులకు, సకాలంలో జీతాలు ఇవ్వాలి.

2) రాజులు, వంశపారంపర్యంగా వచ్చే మంచి సేవకులకు, ప్రీతితో సమ్మానములు చేయాలి.

3) రాజుకోసం యుద్ధంలో మరణించిన వీర సైనికుల కుటుంబాలకు, కూడుగుడ్డలకు లోటు లేకుండా ఇచ్చి, రాజు వారికి సంతోషాన్ని కల్గిస్తూ, ఆ కుటుంబాలను పోషించాలి.

4) ధనము పట్ల లోభబుద్ధి కలవారినీ, దొంగలనూ, ధైర్యము చాలని వారినీ, దుర్మార్గులనూ, రాజకార్య నిర్వహణానికి, రాజులు పంపరాదు.

5) రాజు, రాజ్యాన్ని దొంగల భయము లేకుండా పాలించాలి.

6) రాజు, ప్రజలకు అనావృష్టి వల్ల భయం లేకుండా, చెరువులు త్రవ్వించి వాటిని నిండుగా నీటితో నింపాలి.

7) రాజులు ఉదారబుద్ధితో పేదరైతులకు ధాన్యపు విత్తనాలనూ, వర్తకులకు నూటికి ఒక రూపాయి వంతున, అప్పులనూ ఇవ్వాలి.

8) రాజులు కుంటివారినీ, మూగవారినీ, గ్రుడ్డివారినీ, అంగవిహీనులయిన వారినీ, బంధువులు లేనివారినీ, దయతో పోషించాలి.

9) రాజులు తమకు మేలుచేసిన వారి మేలును గుర్తించి, ఆ మేలు చేసిన వ్యక్తిని, పదిమంది పెద్దలు ఉన్న సభలలో ఉచితరీతిగా సత్కరించాలి.

10) రాజులు తమకు వచ్చిన ఆదాయంలో నాల్గవ వంతుకాని, మూడవ వంతుకాని, లేదా సగాన్ని కాని, మాత్రమే ఖర్చు చేయాలి.

11) ప్రజల ప్రశంసలు పొందే విధంగా రాజులు తమ గురువులనూ, వృద్ధ శిల్పులనూ, గొప్ప వ్యాపారులనూ, బంధువులనూ, ఆశ్రితులనూ, సజ్జనులనూ, వారికి పేదరికం రాకుండా, దయతో పోషించాలి.

12) రాజులు నిత్యమూ, తన మంత్రులు, బంధువులు, సైన్యాధిపతులు, రాజకుమారులు, పండితులు తన సభలో ఉండగా, వారితోపాటు, రాజు కొలువుతీరాలి.

13) రాజు జాగ్రత్తగా గమనిస్తూ, తనకు వెలుపల, లోపల ఉండే శత్రువుల నుండి, తన్ను తాను రక్షించుకోవాలి.

14) రాజు గొప్ప పండితులతో కలిసి, చర్చించి, సర్వ ధర్మాల్లో నేర్పు గలవాడై, రాగద్వేషాలు లేని సమబుద్ధితో, దయతో లోక వ్యవహారాలు విచారించాలి.

15) రాజులు తమ కోటలలో నీళ్ళనూ, ఆహారపదార్థాల్నీ, ధనధాన్యాల్నీ, సమృద్ధిగా నిల్వ చేసుకోవాలి. పై విధంగా రాజులు, ప్రజాపాలనలో ధర్మాలను పాటించాలి.

………………

4. 'రాజనీతి' పాఠము ఆధారంగా, నన్నయ గారి కవితారీతులు, ఎంతవరకు మీ పాఠంలో ప్రతిబింబించాయో తెలపండి.

జ.నన్నయగారు, భారతాంధ్రీకరణను చేస్తూ, "సారమతింగవీంద్రులు" అనే పద్యంలో

1) ప్రసన్న కథాకలితార్థయుక్తి 2) అక్షర రమ్యత

3) నానారుచిరార్థ సూక్తి నిధిత్వము అనేవి, తన కవితా గుణములని ప్రకటించియున్నాడు. 'ప్రసన్న కథా కలితార్థ యుక్తి' అంటే, కథను తన కవితా రచన ద్వారా, పాఠకులకు ప్రసన్నము చేయడం. 2) 'అక్షర రమ్యత' అంటే, రసానుగుణంగా, పద్యాలలో శబ్దాలంకారాలను ఎక్కువగా, శ్రుతి మనోహరంగా ఉండేలా వాడడం. 3) 'నానారుచిరార్థ సూక్తి నిధిత్వము' అంటే, అనేకములైన ఇంపైన 'సూక్తులను', అనగా సుభాషితములనూ, నీతులనూ తన కవితలో ఉపయోగించడం.

పైన చెప్పిన నన్నయగారి కవితా లక్షణాలు, మన పాఠంలో ఎలా ప్రతిబింబించాయో, వివరంగా చూద్దాము.

1) రుచిరార్థ సూక్తి నిధిత్వము:- ఈ పాఠములో, సన్నయగారు, నారదుని చేత ధర్మరాజుకు అనేక సూక్తులను చెప్పించారు. ఈ పాఠంలో, రాజ్యపాలన చేస్తున్న రాజులు, పాటింపవలసిన నీతి సూత్రాలు, చక్కగా చెప్పబడ్డాయి. అవన్నీ, ఇంపైన, పరమ రమణీయమైన, సూక్తులే. నన్నయగారి ఈ రుచిరార్థ సూక్తులు. తెలుగువారి నిత్య వ్యవహారంలో కూడా ప్రచారం పొందాయి. చూడండి.

ఉదా:

ఆ.వె| వార్తయంద జగము వర్తిల్లుచున్నది

యదియు లేని నాఁడ యఖిల జనులు

నంధకారమగ్ను లగుదురు గావున

వార్త నిర్వహింప వలయుఁ బతికి,

ఇప్పుడు ప్రజల వార్తలు, ప్రభుత్వానికీ, ప్రభుత్వ వార్తలు ప్రజలకు, టివి ల ద్వారా, పత్రికల ద్వారా అందుతున్నాయి. పూర్వకాలంలో ఈ వార్తలను, ప్రభువులే చాటింపుల ద్వారా, ప్రజలకూ, చారుల ద్వారా తామూ తెలిసికొనే వారు.

వార్తను గురించి చెప్పిన పై పద్యంలోని సూక్తి వంటి సూక్తి, వెయ్యి సంవత్సరాల తెలుగు సాహిత్యంలో, ఇంతవరకూ రాలేదు. మరికొన్ని మన పాఠంలోని సూక్తులు చూడండి.

1. "రాజునకు విజయమూలము రాజిత మంత్రము"

2. 'ధన మెట్టి వారికిం చేయకుండునె, గర్వము దుర్విమోహముస్'

3. నీ ప్రస్తవమున నని నీల్గిన వీరభటుల అనుపోష్యుల నెల్లను బ్రోతె ?

4. కృత మెఱిగెడు పతియ, జగజ్జనుల నెల్ల పరిపాలించుస్

5. భటుల దౌర్గత్య, విషాదములు ఏలినవాని కవశ్యము ఎగ్గొనరించు

6. పరమహీశుల చరితము వీక్షింతె ? నిపుణ చరనేత్రములస్

ఈ విధంగా, రాజులు పాటింపవలసిన నీతులు, అన్నీ ఎంతో రమ్యముగా ఈ పాఠంలో నన్నయగారు చెప్పారు.నన్నయ, "సూక్తి సుధాకరుడు":

2) అక్షర రమ్యత:-పద్యాలలో శబ్దాలంకారాలు ఎక్కువగా వాడితే, పద్యాలు వినడానికి ఇంపుగా ఉంటాయి. చూడండి.

ఉదా :

కం॥ రాజునకు విజయమూలము

రాజితమంత్రంబు సుస్థిరంబుగ దానిస్

రాజాన్వయ ! రక్షింతె ధ

రాజనులకుఁ గర్ణగోచరము గాకుండఁస్.

పై పద్యంలో 'వృత్త్యనుప్రాస' అనే శబ్దాలంకారం ఉంది. ర, జ, అనే హల్లులు, తరచుగా పద్యంలో వాడి, నన్నయగారు పాఠకులకు, శ్రోతలకు, కర్ణ రసాయనము చేశారు. అలాగే "ఉత్తమ మధ్యమాధమ" అనే 37వ పద్యంలో, రెండు అక్షరాల ప్రాసతో, పద్యాన్ని నన్నయ గారు అలంకరించి 'అక్షరరమ్యత'ను చేకూర్చాడు. నన్నయ గారి పద్యాలు అక్షర రమ్యతకు చక్కని ఉదాహరణలు.

3) ప్రసన్న కథా కలితార్థయుక్తి:- కలితార్థయుక్తిని, కవితార్థ యుక్తిగా, విశ్వనాథవారు వివరించారు. అనగా, పద్య కథను ప్రసన్నం చేయడం. ఇది కవి గారి ప్రతిభకు సంబంధించిన గొప్ప లక్షణం. నన్నయగారు తమ చక్కని కథాకథన శైలితో, భారత కథలను, ప్రసన్నం చేశారు.

ఈ పాఠంలో, రాజనీతులను, ఒక పట్టీగా, నారదుడు ధర్మరాజుకు చెప్పలేదు. ధర్మరాజును, యోగక్షేమాలను అడిగి తెలిసికొంటున్న తీరుగా, నేర్పుగా మంత్రులనూ, సేవకులను, పురోహితులను ఎలాంటి వారిని రాజులు నియమించాలో, నేర్పుగా సూచించాడు. ఇది ప్రసన్న కథా కలితార్థ యుక్తికి, చక్కని ఉదాహరణం. ఈ విధంగా నన్నయ గారి కవితా లక్షణాలు, ఈ రాజనీతి

పాఠంలో చక్కగా ప్రతిబింబించాయి ▪

# 2. దక్షయజ్ఞం

1.'దక్షయజ్ఞం' పాఠ్యభాగ కథను వ్రాయండి.

జ. శివుని భార్య సతీదేవి, యోగాగ్నిలో దగ్ధమయ్యిందని, నారదుడు శివునకు చెప్పాడు. దానితో శివుని కోపాగ్ని, శివుని ఫాలాగ్నితో కలిసి, బ్రహ్మాండము అంతా వ్యాపించింది. అప్పుడు శివుని వాహనమైన నందీశ్వరుడు అనే ఎద్దు, అక్కడకు వచ్చింది. దాని పాదాల త్రొక్కిడికి, భూమి అణగిపోయింది. అప్పుడు ప్రమధ గణనాయకులు విజృంభించారు.

ప్రమథుల ప్రగల్భాలు: ప్రమథులు, ఈశ్వరుడు దక్షునిపై కోపించాడని తెలిసికొన్నారు. వారు శివుని ముందుకు వచ్చి బ్రహ్మప్రళయాన్ని చేయడానికీ, మహాప్రళయాన్ని ప్రారంభించడానికీ, తామే సరిపోతామని చెప్పారు. తామే బ్రహ్మాండాన్ని భేదిస్తామనీ, లోకాల్ని సముద్రంలో కలుపుతామనీ, విశ్వాన్ని సంహరిస్తామనీ, దేవతల గర్వాన్ని పోగొట్టి వారిని బంధిస్తామనీ, చెప్పారు. ఈశ్వరుడు దక్షుడి మీద కోపంతో లోకాన్ని నశింపజేయడం తగదనీ, తమను పంపిస్తే, తామే దక్షుని బంధించి తెస్తామనీ వారు చెప్పారు.

గణపతి ఈశ్వరునితో : అప్పుడు గణాధిపతి అయిన గణపతి, మిగిలిన ప్రమథులను మాట్లాడవద్దని చెప్పి, అది తన తల్లికి జరిగిన అవమానము కాబట్టి, దక్షుని బంధించి తెచ్చే పనిని తనకే అప్పగించుమని శివుని కోరాడు. శివుడు దక్షయజ్ఞాన్ని ధ్వంసం చేసి, దక్షుని బంధించి తీసికొని రమ్మని, గణపతికి చెప్పాడు.

అప్పుడు ఆయుధాలు ధరించి ప్రమథనాయకులు గణపతి దగ్గరకు వచ్చారు. మహాకాళి, శాకిన్యాది దేవతలతో వచ్చింది. గణపతి, వీరందరితో కలిసి, దక్షుడిపై దండెత్తాడు.

యజ్ఞశాల ధ్వంసము : ప్రమథులు, యజ్ఞరక్షకులను తరిమివేశారు. వేదికలను త్రవ్వి గుండాలను పడద్రోశారు. ఋత్విక్కులను పాతిపెట్టారు. యజ్ఞపర్యవేక్షకుడి మెడనులిమి, యూపస్తంభానికి కట్టారు. అగ్ని నాలుకను చీల్చారు. దక్షయజ్ఞాన్ని నాశనం చేసి ప్రమథులు గట్టిగా అఱచారు.

ప్రమథనాయకుల విజృంభణ: ప్రమథుల విజృంభణను చూసి, బ్రాహ్మణులు, దేవతలు, భయపడి పారిపోయారు. కొందరు భయంతో మొఱపెట్టారు. కొందరి పైప్రాణాలు, పైకిపోయాయి. కొందరు సేనాముఖము నుండి పారిపోయారు.

బ్రహ్మ, విష్ణువు, ఇంద్రుడు, యముడు, వరుణుడు, కుబేరుడు అతి కష్టంమీద ఆ యజ్ఞశాల నుండి ఎలాగో తప్పించుకొని పారిపోయారు. అప్పుడు ప్రజాపతులు దక్షుడిని అక్కడ లేకుండా దాచి, తాము బ్రహ్మాండ ఖండానికి వెళ్ళారు.

ప్రమథులు దక్షుని వెదకడం- విజృంభణ :-

ప్రమథులు అన్ని దిక్కుల్లోనూ దక్షుని కోసం వెతికారు. వారికి దక్షులు కనబడలేదు. వారు దానితో అన్ని లోకాల ప్రభువులపై దండెత్తారు. ప్రమథులు, దేవరాక్షస నాగగణాలను అర్థముంది. వారి వీపుల చర్మాలు ఊడదీశారు. వారి మెడలకు గుదిబండలు కట్టి వారిచే మోయించారు. వారి తలలను కట్టి, నా పెడచేతులు కట్టి, వారి చర్మాలు ఊడదీశారు. ప్రమథులు, ఇంద్రుని చేతిని విరుగగొట్టి, అతణ్ణి పడగొట్టారు. యజ్ఞపురుషుడే తలపుట్టెను, ఊడగొట్టారు, భగుడి కన్నును పీకి, పూషుని ముందు పండ్లు రాలగొట్టారు. బ్రహ్మవిష్ణువులను, బంధించారు. దక్షుడు ఎక్కడ ఉన్నాడో చూపమనీ, దేవతలను వారు

దండించారు. కొందరు మునులు, దేవతలు, దక్షుడు దాగిన ప్రదేశాన్ని కనుసన్నం చేసి, ప్రమథులకు చూపించారు. ప్రమథులను బెదరు చూపులు చూస్తున్న దక్షుడిని పట్టుకొన్నారు.

**ప్రమథులు దక్షుని బంధించి తీసుకురావడం:-**

ప్రమథులు దక్షుని పట్టుకొని 'వీడే దక్షుడు. శివుడిని దూషించిన, వీడి నాలుకను కోసి ఉప్పు, అద్దండి. సీసాన్ని కరగించి వీడి శరీరానికి పూయండి. వీడి కళ్ళు పీకి వేయండి, అంటూ దక్షుడిని దండించి, గణపతికి అప్పగించారు. గణపతి ఆజ్ఞపై ప్రమథులు దక్షుని కాళ్ళూ, చేతులూ కట్టి కావడిలో దక్షుడిని పెట్టి, శివుని వద్దకు తీసుకువచ్చారు.

...........

2. 'దక్షయజ్ఞం' ఆధారంగా నన్నెచోడుని కవితా వైభవాన్ని తెలపండి.

జ. నన్నెచోడుడు, కుమార సంభవము' అనే, తొలి తెలుగు ప్రబంధాన్ని రచించాడు. నన్నెచోడుడు, నన్నయ కంటె, ప్రాచీనుడు, కాదని, వాదములు ఉన్నాయి. నన్నెచోడుడు, వర్ణన ప్రియుడు. ఈ కవి అలంకార సుందర రచనా ప్రియుడు. అర్థాలంకారాలను, శబ్దాలంకారాలను కూడా ఎక్కువగా ప్రయోగించాడు. ఈ కవి కావ్యము, సర్వ రసములకు, అలవాలను, నన్నెచోడుడు తన కావ్యాన్ని ప్రబంధము అని, పిలిచాడు. నన్నెచోడుడు, తనది 'వస్తు కవిత్వము' అని పేర్కొన్నాడు. వస్తు కవిత్వము అంటే, శృంగారాది నవరసాలతో, ప్రసిద్ధ వర్ణనలతో, దేశి కవితారీతులతో, ఉపమాద్యలంకారాలతో, పండితులు ఆదరించే కవిత్వము అని చెప్పాలి. దేశి కవిత్వమే. సరియైన కవితామార్గమని నన్నెచోడ కవి చెప్పాడు. ఈతడు. "జానుతెనుగు" రచనయన్న ఇష్టము

కలవాడు. జానుతెనుగ అంటే, భావ సారళ్యత, సరసత, ప్రసన్నత గల, కవిత్వము, నన్నెచోడుని 'కుమార సంభవము", స్వతంత్రమైన తో ప్రబంధము.

'దక్షయజ్ఞం' పాఠంలో అలంకార ప్రియత్వము, వర్ణన నైపుణ్యము కనబడతాయి. నన్నెచోడుడు, అలంకార రచ ప్రియుడు. 'దక్షయజ్ఞం' పాఠములో మనకున్న 37 పద్యాలలోనూ, ఆటు 'ఉపమాలంకారాలు', రెండు "ఉత్ప్రేక్షలు ఒక స్వభావోక్తి', ఒక "దృష్టాంతము", రెండు మూడు "శబ్దాలంకారాలు" ఉన్నాయి. చూడండి.

1. ఉపమాలంకారాలు:

గీ॥ 'ఎలుకతోడి కోపమున ని ల్లేర్చునట్లు
దక్షుపై నల్గి జగమెల్ల నీ క్షణంబ
సంహరింపంగఁ దలఁచుట సన్నె ? వానిఁ
బట్టి తెచ్చెద వడి నన్నుఁ బనుపు దేవ! (ఉపమాలంకారము)

2. గణాధీశ్వరుండు పరమేశ్వరున కభిముఖుండై ప్రళయకాల నీలఘనా ఘనంబునుం బోలె మహాధ్వని గర్జిల్లుచు.దీనికి ఉత్ప్రేక్షాలంకారము ఉంది.

మరొక ఉత్ప్రేక్షాలంకారము చూడండి.

3. కం లోకాలోకములోఁ గల
చీఁకటి యెల్ల నొకపొడవు సేకొనియెనా నా నాకాశ మడరి వచ్చె మ
హాకాళి మహాభయంకరాకారముతోన్, (ఉత్ప్రేక్షాలంకారము)

ఈ అందమైన ఉపమాలంకారం చూడండి.

4. ఆ.వె.. వాహనంబు నెక్క వచ్చి భయంబున వడCకి నేలఁబడ్డ వనజగర్భుఁ

గమిచికొని మరాళకము వాఱిఁజెందమ్మిఁ గఱచికొని రయమునఁ బఱచినట్లు

ఇది కూడా ఒక అందమైన ఉపమాలంకారము. దీన్ని గమనించండి.

5. ఆ.వె|| పేఁటకాలు ముట్టి వెనుకొనఁగా శ్వేత నగము చఱికిఁ దారు సమిలివోలె

నభ్రగజము మీఁదికా సహస్రాక్షుండు

ప్రాఁకి పాఱెఁ బ్రమధరాజి యార్వ,

ఈ క్రింది పద్యంలో ఉపమ, ఛేకానుప్రాసలు ఉన్నాయి..

6. ఆ.వె|| గరుడి నడుము మెడయుఁ గాలను గేలను

నిఱికికొనుచుఁ జక్రి వెఱచి పఱచె

ఘర్మజలము లొడలఁ గ్రమ్మంగ వర్షేంద్ర

చాప జలద భాతిఁ జదలఁ బొదల,

నన్నెచోడుని వర్ణనా ప్రియత్వము, ఈ క్రింది పద్యాలలో కనిపిస్తుంది. ఈశ్వరుని వాహనమైన వృషభమును, "ఖురపడ ఘటనస్ త్రిలోక భయంకరాకృతిస్"- అనే పద్యంలో, అద్భుతంగా సహజ సుందరంగా నన్నెచోడుడు వర్ణించాడు.

ఈశ్వరుని భయంకరాకారమును, 'మహాగ్రస్థర' వృత్తములో, "వివిధాస్త్రానీక జాతావిరల బహుల సద్విస్ఫులింగాగ్నియుస్' అంటూ, శివుని ఉగ్రరూపాన్ని కవి నన్నెచోడుడు పాఠకుల కన్నులకు కట్టించాడు.

నన్నెచోడుడు తాను చెప్పినట్లు, ప్రబంధ కవితకు తన వర్ణనలతో ఇతడు ఆద్యుడయ్యాడు. దేశి కవితకు, వస్తు కవితకు, జాను తెనుగుకు, ఇతడు ప్రాణం పోశాడు. నన్నెచోడుడు, తెలుగువారికి ఉన్న మహాకవులలో 'కవిరాజ శిఖామణి అనిపించుకున్నాడు.

# 3. ధౌమ్య ధర్మోపదేశము

1. ధౌమ్యుడు పాండవులకు చేసిన ధర్మోపదేశాన్ని వివరించండి.
3. ధౌమ్యుఃడు పాండవులకు, పురోహితుడు. పాండన్నలు అజ్ఞాతవాసానికి వెడుతున్నప్పుడు ధౌమ్యుడు పాండవులకు రాజసేవా ధర్మాలను, ఇలా బోధించాడు.

రాజసేవా ధర్మాలు : "రాజ సేవకుడు, తగిన పద్ధతిలో రాజసభలోకి ప్రవేశించాలి. తనకు తగిన ఆసనంలో కూర్చోవాలి. తన రూపము, వేషము, వికృతంగా ఉండరాదు. సమయం తెలిసికొని, రాజును అతడు సేవిస్తే, రాజ సమ్మానాన్ని అతడు పొందుతాడు. రాజు కొలువులో ఉన్నానని, రాజుతో చనువుగా తిరుగుతున్నానని. తాను భయం లేకుండా, మర్యాదను అతిక్రమిస్తే, పురుషార్థానికే హాని కలుగుతుంది..

సేవకుడు, రాజుగారి ఇల్లు కంటె, అందంగా ఇల్లు కట్టరాదు. రాజుగారి వలె వేషము ధరించరాదు. రాజువలె విహారం చేయరాదు. రాజువలె నేర్పుగా మాట్లాడరాదు. రాజాజ్ఞను ధిక్కరిస్తే, రాజులు, వారు తమ కొడుకులు, సోదరులు. మనుషులు, స్నేహితులు అని కూడా చూడకుండా వారిని శిక్షిస్తారు.

సమర్థుడి పనికి అడ్డు వెళ్ళి. ఆ పనిని తనమీద వేసుకొని తిరిగితే, ఆ సేవకుడికి హాని కలుగుతుంది. రాజు దగ్గర, మౌనంగా కాని, ఆర్భాటంగా కాని మాట్లాడడం పనికిరాదు. నాగరికులతో కలసి, రాజు దగ్గర మాట్లాడాలి. సేవకుడు, రాజు దగ్గర ఉన్నప్పుడు ఇతరులకు వ్యతిరేకంగా సమాధానం చెప్పరాదు. అవసరం అయినప్పుడు, తనకు తానే ముందుకు వచ్చి, రాజాజ్ఞను పాటించాలి..

అంతఃపురాలలోని మాటలు, బయటపెట్టకూడదు. రాజుకు సంబంధించిన మాటలు తాను వింటే, బాగా ఆలోచించి.. ఆ మాటలు రాజు వినదగ్గపయితేనే రాజుకు చెప్పాలి. భటుడికి అంతఃపురంతో సంబంధం, మంచిదికాదు. అక్కడ తిరిగే గూనివారు, పొట్టివారు, పరిచారికులు మొదలయిన వాళ్ళతో, స్నేహం కీడును కల్గిస్తుంది.

రాజు ఇస్తేనే, సేవకులు ఉత్తమాసనాలనూ, పెద్ద వాహనాలనూ, ఎక్కాలి. రాజు తనను గౌరవించాడని కానీ, అవమానించాడని కానీ భావించక, వెనుకటి లాగే, సేవకులు, రాజు దగ్గర నడిస్తే, ఆపదలు పోయి మంచి జరుగుతుంది.

రాజు ఎవరినైనా రక్షించాలని కాని, శిక్షించాలని కాని, అనుకున్నట్లు తనకు తెలిసినా, ఆ పనులు జరగడానికి ముందుగానే. ఆ విషయాన్ని బయటపెట్టేవాడు మూర్ఖుడు. ఎటువంటి పరిస్థితులు ఎదురైనా, సేవకులు రాజు తమకు చెప్పిన పనిని శ్రద్దగా చెయ్యాలి. రాజ ధనాన్ని పాము ఎముకలుగా భావించి, దానిని సంగ్రహించడం మానకపోతే.. సేవకుల మాన ప్రాణాలు విలునవు

రాజు సభ తీర్చియున్నప్పుడు సేవకుడు బహిరంగంగా, ఆవులింత, తుమ్ము, నవ్వు, ఉమ్మివేయడం చేయకూడదు. శత్రువుల దూతలకు, రాజు కోపానికి గురి అయిన వారికీ, పాపాత్ములకూ, రాజ సేవకులు, దగ్గరగా ఉండరాదు. అలా చేస్తే, చివరకు కీడు, నింద, వస్తాయి.

రాజు దగ్గర ఉండే ఏనుగుతో కానీ, దోమతో కానీ, విరోధం పనికిరాదు. రాజ కొలువుకు సంబంధించినవారితో స్నేహం నుంచిది. సేవకుడు విచ్చలవిడిగా, భోగాలను అనుభవించరాదు. అణకువగా ఉండి, వేడుకలు చేసుకోవాలి.

ఈ విధంగా, ధౌమ్యుడు పాండవులకు సేవా ధర్మాలను ఉపదేశించాడు.

............

2. 'ధౌమ్యోపదేశము' పాఠం ఆధారంగా తిక్కన కవితా రీతులను సోదాహరణంగా వ్రాయండి.

జ. తిక్కన భారత రచన, తెలుగు సాహిత్య చరిత్రలో, ఒక సువర్ణ ఘట్టము, తిక్కనకు, "కవిబ్రహ్మ", "ఉభయకవి మిత్రుడు" అనే బిరుదులు ఉన్నాయి. తిక్కన తన నిర్వచనోత్తర రామాయణంలో, తాను 'ఉభయ కావ్య ప్రౌఢిని పాటించే శిల్పంలో, పౌరగుడను" అని, "కళా విదుడను" అని, చెప్పాడు: అంటే సంస్కృతాంధ్ర భాషల్లో ఆ కవులు ప్రదర్శించిన ప్రౌఢత్వాన్ని తాను పాటించే శిల్పములో చూపడంలో తాను నిష్ణాతుడను అని చెప్పుకున్నాడు.

భారతములో మాత్రం, తిక్కన "భారతామృతాన్ని, తమ చెపులతో ఆస్వాదించి, ఆంధ్రులు ఆనందం పొందేటట్లు తాను మహాకవిత్వ దీక్షను చేపట్టి, తాను నేర్చిన విధంగా, కవిత్వాన్ని చెపుతా"నని, వినయంగా చెప్పాడు.

తిక్కన, చిన్న చిన్న పదాలతో కూడిన వాక్యరచనతో కావ్యాన్ని రచిస్తాడు. తిక్కన కవితకు, ఇది ఆయువుపట్టు దీనినే నాటకీయత' అని విమర్శకులు చెపుతారు

"తిక్కన్న శిల్పంపు తెలుగు తోట" అని, విశ్వనాధవారు, తిక్కనను మెచ్చు కున్నారు. తిక్కన అచ్చ తెలుగు పదాలను ఎక్కువగా వాడి, తెలుగుభాషకు జీవం పోశాడు. ఉభయ కావ్య ప్రౌ, నాటకీయత, రసధ్వని, రసానికి తగిన కవితా రచన, తిక్కన కవితా గుణాలని చెప్పాలి. సందర్భోచిత పదప్రయోగం, వర్ణనా సామర్థ్యం,

పాత్రపోషణ నైపుణ్యం, తెలుగు ముడికారాల సొంపు, అల్పాక్షరాలలో అనల్పార్థ స్ఫూర్తి తిక్కనలో కన్పిస్తాయి.

తిక్కన కవితా గుణాలు-ఢామ్యోపదేశము:-

1) అచ్చ తెనుగు పదాలను తిక్కన ఎక్కువగా ప్రయోగిస్తాడు. మన పాఠంలో పద్యాలు అన్నీ చిన్న చిన్న తెలుగు మాటలతో అందంగా కూర్చబడ్డవే. అంతేకాదు. తిక్కన కందపద్య రచనలో అందెవేసిన చేయి. ఈ పాఠంలో ఉన్న ముప్పైపద్యాలలో, 18 కందపద్యాలే ఉన్నాయి.
2) తిక్కన సందర్భానుగుణంగా, రసమును పోషిస్తూ అలంకారాలను ప్రయోగిస్తాడు. "వాలి వివిధాస్త్ర విద్యా జ్వాలల వెలుఁగొందు "పాండవ జ్వలనంబు" అనే పద్యంలో, "పాండవ జ్వలనము" అని రూపకాలంకారం చక్కగా వాడాడు.

తిక్కన నీతులు : 1) ఎఱిగెడు వారికి నైనను, గజపక తక్కరుచిత ప్రకారము శుభముం గోజలు హితులు

3) రాజగృహంబు కంటే నభిరామముగా నిలు కట్టగూడదు. 3) అంతిపురము చుట్టటికం బెంతయు కీడు 4) తానెంత

పూజ్యుడైన జనుల పొందు లెస్స మొదలగునవి.

నాటకీయత:- ధౌమ్యుడు పాండవులకు చెప్పిన నీతులు అన్నీ తిక్కవ నాటకీయ రచనకు చక్కని ఉదాహరణలే. అలాగే పాండవులు, ధౌమ్యునికి కృతజ్ఞతను

వెల్లడిస్తూ “తల్లియుఁ దండ్రియు దైవము, నెల్ల సుహృజ్జనము మీర అని చక్కగా చెప్పడం కూడా, తిక్కన నాటకీయ శిల్ప రచనకు చక్కని ఉదాహరణ.

అచ్చ తెలుగు పదాల పోహణింపు:-తిక్కన అచ్చతెలుగు పదాలను ఎక్కువగా వాడతాడు. చూడండి.

1) బ్రదికితిమి మీ కరుణన్
2) ఎండకు వానకోర్చి, తన యిల్లు ప్రవాసపు జోటు నాక,
3) చదువాని కార్యంబున కద్దము సాచ్చి,
4) తానును బయి పూసికొనుట
5) ఒడ్డులకుందగ డట్లు సేయగన్ మొదలగునవి.

తిక్కన గావించిన ధర్మబోధ: తిక్కన భారతంలో ఎన్నో ధర్మాలను ప్రబోధించాడు. ఈ పాఠంలో కూడా ధౌమ్యుని ద్వారా. తిక్కన ఎన్నో రాజసేవా ధర్మాలను హృదయానందకరంగా తెలుగువారికి అందించాడు.

ఉదా: కం॥ మన్నన కుబ్బక, యనమతి దన్నిందిన స్రుక్కంబడక, ధరణీశుకడన్ మున్నున్న యట్ల మెలఁగిన యన్నరునకు శుభము లొడవు నాపద లడఁగున్.

ఇలాంటి పద్యాలు ఈ పాఠంలో ఎన్నో ఉన్నాయి.

ఈ విధంగా తిక్కన తన రచనా శిల్పమును, ‘ధౌమ్యోపదేశము’ అనే ఈ పాఠంలో చక్కగా ప్రదర్శించాడు. తిక్కన ‘కవిబ్రహ్మ’. తిక్కన చేసిన ‘కవితాసృష్టి’ అనంతర తెలుగు కవులకు భిక్ష పెట్టింది. తిక్కన తెలుగువారికి ఉన్న మహాకవులలో మేటి

రత్నము. తెలుగు భాషాపదాలను, సజీవంగా తన కవితా రచన ద్వారా ఆంధ్రులకు అందించిన తిక్కన మహాకవి. ఆంధ్రులకు చిరస్మరణీయుడు..

………….

# 3.పలనాటి బెబ్బులి

1. పలనాటి బెబ్బులి కథాంశమును వ్రాయండి.

జ. బాలచంద్రుని యుద్ధము:- బాలచంద్రుడు, శత్రువుల మణికట్లను, తలలను, మోచేతులను, ముక్కులను, ముదురులను, ప్రక్క ఎముకలను, దౌడలను, బాహువులను, కనుగ్రుడ్లను, చెవులను ఖండించాడు. గుండెలను చీల్చి, మోకాళ్ళను. పిక్కలను, చీలమండలను, సరికాడు. పిల్ల సింహమువలె, ఏనుగులపైకి ఉరికి, వాటి కుంభ స్థలములను, తొండములను, తోకలను, ఖండించి, మావటి వాండ్రను చంపి, దొరలను పడగొట్టి, వాటి దంతాలనూ, చెవులనూ, పిల్ల దంతాలనూ, కాళ్ళనూ, కంఠాలనూ సరికాదు. సాహసంతో గుజ్జములను కత్తులతో, ఈటెలతో పొడిచి, రౌతులను చంపి వారు ప్రయోగించిన వేటకుక్కలను తుక్కుచేసి, శృంగ ధనుస్సులను ముక్తులు చేసి, బాణములను, అమ్ములను, కత్తులను, దాటులను ఖండించి, మెడలు నరికి, శరీరాలు చీల్చి, రొమ్ములను, ఈటెలతో గ్రుచ్చి, కొంకులు, డెక్కలు , చెక్కి యుద్ధం చేశాడు.

నలగామరాజు సైన్యం కలత:- నలగాముని సైన్యము, పై విధంగా భగ్నమయ్యింది. వారి కంఠాలు తెగాయి. వాహనాల నుండి, వీరులు ఉరికారు. తన్నుకొని చచ్చారు. తలలు, తెగాయి. వారు కళ్ళు తెరుస్తూ, గంతులు వేస్తూ, ప్రాణాలు వదిలారు. పళ్ళు కొరుకుతూ, కూలబడ్డారు. చేతులు తెగినా, వారు కత్తులు వదలలేదు. ప్రేగులు బైటకు వచ్చినా, వాటిని పట్టుకొని, 'నేను' నేను అంటూ, ముందుకు వచ్చారు. ముసలి యోధులు, చచ్చారు. బాలచంద్రుడిని చూసి, భయపడి పారిపోయారు. కొందరు బ్రతిమాలారు. ఇలాంటి యుద్ధం మాకు తెలియదు అనీ, అన్నం కోసం వచ్చామనీ, ఏడుస్తూ ప్రాణాలు వదిలారు. మేము పాలేర్లము. అడువారు తిట్టారని యుద్ధానికి వచ్చాము. పారిపోనిస్తే, బ్రతుకుతాము అనీ,

తాము బోయీలమనీ, నాగమ్మ మాటలు నమ్మి యుద్ధానికి వచ్చామని, ప్రాణాలు దక్కితే, బలుసాకు తిని బ్రతుకుతామనీ. చెప్పారు. పౌరుషం విడిచిన వారు, తోడి వీరులను విడిచి, పారిపోయారు, చచ్చినట్లు పడియున్నవారు, ఎనుగుల ప్రక్కన దాగినవారు, పెళ్ళాలను తలచుకొని ఏచ్చినవారు, గడ్డిలో దూరిన వారు, జుట్టు విప్పిన వారు, చతికిల పడినవారు; చచ్చినా కత్తులు విడువని సైనికులూ, ఈ విధంగా యుద్ధరంగం, భయంకరంగా ఉంది.

బాలచంద్రుడు శత్రువులను చంపడం :-

బాలచంద్రుడు పరిఘను గుండ్రంగా త్రిప్పుతూ, బాణాలు తనపైకి రాకుండా చేసుకొన్నాడు. శత్రువుల ధనుస్సులనూ, వింటి నారులను, పారిపోయేవారినీ, ఖండించారు. బాలచంద్రుడు సోదరులతో కలసి, గొడ్డళ్ళతో నరికి, డాలులను, బల్లెములను ఖండించి, గండ్రగొడ్డళ్ళతో శత్రువులను, కణుపులుగా కొట్టాడు. వారి తలలను గదలతో కొట్టాడు. పొట్టలు చీల్చాడు. కత్తులతో కండలు కోసి, యముని వద్దకు పంపాడు. దానితో సైన్యము పారిపోడానికి సిద్ధమయ్యింది.

నరసింహభూపతి తన సైనికులకు ధైర్యం చెప్పడం: -

"ఓడి పారిపోవడం, వీరధర్మం కాదు పిల్లలను చూసి, పరుగు పెట్టడం, దేనికి ? మిమ్ములను రక్షించిన వారిని, విడిచి పెట్టడం, మంచిది కాదు. మీలోని రక్తం, రాజు పెట్టిన అన్నంతో పెరిగినదే. నమ్మిన రాజును సట్టేటిలో ముంచి వెళ్ళడం, నీతి కాదు శరీరాలు, అశాశ్వతాలు ధనములు కల్ల. కీర్తి ఒక్కటే శాశ్వతము, ఆధైర్యంతో, వీరధర్మం మాని, నశించే మలభాండమైన శరీరం కోసం, కీర్తిని పోగొట్టుకొని, పారిపోయే వెట్టివారు ఉండరు. వీరులకు యుద్ధరంగాలే విహార వనములు, చచ్చినా, బ్రతికినా, అక్కడే వారికి సౌఖ్యము మీరు పారిపోతే, భుక్తి, ముక్తి, రెండూ పోతాయి, నన్ను విడువడం, న్యాయం కాదు. మృత్యువు, మన శరీరాలను

ఆవహించింది. మనం పెళ్ళికి, రాలేదు. యుద్ధానికి వచ్చాము, వచ్చిన పని, గంగలో కలిపి, పారిపోవడం నీచము. మీరు వెళ్ళవద్దు. వెడితే, రాజుపై ఒట్టు. అని నరసింగు, తన సైనికులతో అన్నాడు.

నలగామరాజు సైన్యము బాలచంద్రునితో పోరు:-

నరసింగు మాటలకు కోపం తెచ్చుకొని, మంటపై మిడుతలవలె సలగాముని సైనికులు, బాలచంద్రునిపై పడ్డారు. బాలచంద్రుడు, సముద్రంలో మందరములా, కాలాగ్ని లోకాల్ని కాల్చినట్లు, దావాగ్ని అడవులపై పడ్డట్టు, శత్రుసైన్యం పైకి ఉరికి, వారి అస్త్ర, శస్త్రాలను సరికి, హుంకరిస్తూ భటులను పట్టుకొని, బల్లెములతో చీల్చి పడగొట్టారు. వారి శరీరాలను చీల్చి, నేలపై పడవేశాడు. వారి కటి ప్రదేశాలను, ఖండించి నేలపై పడవేశాడు. వారి తలలను, కత్తులతో నరికాడు. బల్లెములతో గ్రుచ్చి వారిని కూచ్చాడు. రక్తం నేలపై నిందుగా ప్రవహించింది. ఎదురు లేకుండా యుద్ధం ఈ విధంగా సాగింది. నరసింగరాజు యుద్ధాన్ని చూచి, వణకిపోయాడు. ఆయన బాలచంద్రుని పరాక్రమానికి, ఆశ్చర్యపడి ముక్కున వ్రేలు వేసుకున్నాడు.

...........

2. పలనాటి యుద్ధంలో బాలచంద్రుని యుద్ధకౌశలాన్ని వర్ణించండి.

జ. బాలచంద్రుడు పలనాటి బ్రహ్మనాయుని కుమారుడు. బాలచంద్రుడు, మహావీరుడు.

బాలచంద్రుని యుద్ధము:- బాలచంద్రుడు, శత్రు సైనికుల మణికట్లను ఖండించి, వారి తలలను నరకి, నేలపై పడవేశాడు. శత్రు సైనికుల మోచేతులను, నరికాడు. వారి ముక్కులను ఖండించాడు. నొసళ్ళను చీల్చారు. ప్రక్క ఎముకలను కోశాడు. చెంపలను రాలగొట్టాడు. బాహువులను ఖండించాడు. వారి కంటిగ్రుడ్లు

పగిలేటట్లు, చెవులు తెగి క్రిందపడేటట్లుగా, వారి రొమ్ములను, ముక్కలు చేశాడు. వారి తొడలు, ముక్కలై ఊగేటట్లు చేశాడు. శత్రువుల మోకాళ్ళు, ఊడిపోయే విధంగా, పిక్కలు విరిగేటట్లుగా, చీల మండలు పట్టు తప్పి బాధను కల్గించేటట్లుగా సోదరులతో కలసి బాలచంద్రుడు యుద్ధం చేశాడు.

తరువాత బాలచంద్రుడు, కోపంతో సింహపు పిల్లవలె దుమికి ఎగిరి, శత్రువుల ఏనుగులపైకి ఉదకాడు. ఏనుగుల కుంభస్థలములను పగులకొట్టాడు. ఏనుగుల తొండములనూ, తోకలనూ, ముక్కలు చేసి, మావటివాండ్రను చంపి, వాటిపై నున్న దొరలను నేలపై పడగొట్టాడు. ఎనుగుల దంతాలు, నేలపై రాలిపడేటట్లు, వాటిని పొడిచాడు. వినుగుల చెవులను కత్తితో ఖండించి, ముక్కలు చేశాడు. చిన్న దంతాలను పెల్లగించి, విసరివేశాడు. ఏనుగుల పాదాలను ఖండించి. వాటి కంఠాలను నరికాడు.

తరువాత శత్రువుల గుఱ్ఱాలపై పడి, కత్తి, బల్లెము తీసుకొని, గుఱ్ఱపు రౌతులను చంపాడు. తమపై శత్రువులు ప్రయోగించిన వేటకుక్కలను, తుక్కుచేశాడు శత్రువుల శృంగ ధనుస్సులనూ, బాణాలనూ, అమ్ముల పొదులనూ, ధగ్నము చేశాడు. వారి కత్తులనూ, డాలులనూ, ముక్కలు చేశాడు. గుఱ్ఱాల మెడలను ఖండించాడు. శత్రువుల శరీరాలను చీల్చాడు. వారి రొమ్ములను ఈటెలతో గ్రుచ్చాడు. జంకు లేకుండా గుఱ్ఱాల కాలిగిట్టలను ఖండించాడు. సైనికుల కంఠాలు తెగిపడ్డాయి. సైనికులు తన్నుకుంటూ పడిచచ్చారు.

ఈ విధంగా, బాలచంద్రుడు, చాలాసేపు యుద్ధం చేశాడు. శత్రు సైన్యము, భగ్నమయ్యింది. నలగామరాజు సైన్యము పారిపోయేందుకు, సిద్ధపడింది. పారిపోతున్న సైనికులకు, నరసింహరాజు ధైర్యం చెప్పగా, వారు, తిరిగి బాలచంద్రుని పైకి మంటపై మిడుతల వలె, వచ్చి పడ్డారు.

బాలచంద్రుని శత్రు సంహారము: బాలచంద్రుడు తన సోదరులనందరినీ యుద్ధంలో తగిన స్థలాలలో నిలబెట్టాడు. ఒక పరిఘమును, తన చేతితో పట్టుకొని, తన శరీరానికి శత్రువుల బాణాలు తగులకుండా. బాలచంద్రుడు ఆ పరిఘను త్రిప్పాడు. శత్రువుల బాణాలను చెదరగొడుతూ, తన కత్తిని ఆడిస్తూ, గర్జించాడు. అట్టహాసము చేస్తూ, ధనుర్ధారులపై పడి, వారి ధనుస్సులను విరిచి, వారి వింటినారులను, చిన్న చిన్న ముక్కలుగా చేశాడు. శత్రువుల అమ్ముల పొదులనూ, బాణాలనూ, పిండి పిండి చేశాడు. పరుగెత్తేవారిని, మహాశౌర్యంతో వండడానికి తరిగినట్లు, వారి శరీరాలను ఖండించి, వారిని యముడి దగ్గరకు పంపాడు.

బాలచంద్రుడు, చొక్క చువ్వల వారు శౌర్యంతో తనపైకి ఉరికి రావడం చూసి, పెద్దగా కేకపెట్టి, పకపక నవ్వాడు. వారిపైకి తాను దుమికి, గొడ్డళ్ళతో చెఱకులు నరికినట్లు వారి ఈటెలనూ, ఖడ్గాలనూ ముక్కలు చేశాడు. శూలములతో. చిన్న కత్తులతో, వారిని పొడిచాడు. గండ్ర గొడ్డళ్ళతో, కణుపులుగా వారిని ఖండించాడు. బాకులతో వారి రొమ్ములను చీల్చాడు. గదలతో, శత్రువుల తలలను, పిండి చేశాడు. వారి పొట్టలను బ్రద్దలు చేసి, వారి శరీరాల కండలను, కత్తులతో రాలగొట్టి, శత్రు సైన్యాలను, యముని వద్దకు పంపాడు. ఈ విధంగా, బాలచంద్రుడు, మహా భయంకర యుద్ధము చేశాడు.

..........

3. బాలచంద్రునితో యుద్ధం చేయలేక, నలగామరాజు సైన్యము ఏవిధంగా భయపడిందో తెల్పండి.

జ. నలగాముని సైన్యాల వ్యాకులత: బాలచంద్రునితో యుద్ధం చేయలేక, నలగాముని సైన్యమంతా, చెల్లా చెదరయ్యింది.

వారి సైనికుల, కండాలు, తెగిపడ్డాయి. సైనికులు, వారి వాహనాలపై నుండి, వెంటనే క్రిందికి ఉరికారు. సైనికులు క్రిందపడ్, కాళ్ళూ, చేతులూ కొట్టుకున్నారు. వారి తలలు తెగిపోయి, నేలమీద పడి, మరణించారు. వారిలో కొందరు కళ్ళు తెరుస్తూ, గంతులు వేస్తూ ప్రాణాలు విడిచారు. కొంతమంది తమ పాదాలు విరిగిపోయినా, యుద్ధం చేయడానికై లేచి, పళ్లు కొరుకుతూ నేలపై కూలిపడ్డారు. కొందరి చేతులు తెగిపోయాయి. ఆ భయంకరులైన భటులు తమ కత్తులను వదలి, బాలచంద్రుడిని చూసి భయపడ్డారు. కొందరి సైనికుల ప్రేగులు, బయటకు వచ్చినా, వారు ఎడమచేతితో వాటిని ఎత్తి పట్టుకొని, సాహసంతో బల్లెమును గట్టిగా పట్టుకొని, “నేను నేను” అంటూ ముందుకు రావడానికి ప్రయత్నించి, ఏ మాత్రమూ చలించకుండా, పెద్ద సాహసంతో నిలిచారు. కొందరు ముసలి యోధులు, మూల్గుతూ చచ్చారు కొందరు పిరికిభటులు, బాలచంద్రుడిని చూసి భయంతో బెదరి, పరుగు పెట్టారు.

కొందరు సైనికులు, తాము పారిపోలేక, బ్రతకాలనే ఆశతో తమను రక్షించమని, బ్రతిమాలారు. ఇల్లాంటి యుద్ధాలు, మేము ఎప్పుడూ ఎరుగము. ఇక్కడ నుండి ఎలా వెడతాము ? అంటూ, కొందరు విడ్చారు. “అన్నము కోసం భార్యాపిల్లలను వదలి, యుద్ధానికి వచ్చాము. ఈ నేలపై, మా మృత్యువు వ్రాయబడింది” అని దుఃఖిస్తూ, అసురుసురంటూ, వేగంగా కొందరు ప్రాణాలు వదిలారు.

“మేము చాలారోజులు పాలేర్లుగా పనిచేసి, ఆడువారు తిట్టారని, ఆ తిట్లు పడలేక వచ్చి, యుద్ధరంగంలో చస్తున్నాము. మమ్మల్ని పారిపోనిస్తే, బ్రతుకుతాము” అని కొందరు, దీనభటులు నమస్కరిస్తున్నారు. “మేము పూర్వకాలంలో, బోయీలము మా భుజాలపై కాయలు చూడండి. శత్రువులు మమ్మల్ని చూస్తే పారిపోతారు.మీకు ఏమీ భయము లేదని,నాగమ్మ మమ్ముల్ని బాగా నమ్మించి,

యుద్ధానికి పంపితే మేము వచ్చాము. మా ప్రాణాలు దక్కితే, మా పిల్లలను కలిసి, బలుసాకు తినియైనా ఏదోరకంగా బ్రతుకగలము. మీరు పిల్చినప్పుడు, మేము వస్తాము" అంటూ కొందరు, సమస్కరించాడు. ఈ విధంగా, అవమానంతో పౌరుషాన్ని విడివి, కొందరు మానహీనులు, వీలు చిక్కగానే, తోడి యుద్ధవీరులను వడలి పారిపోయారు.

కొందరు యుద్ధభూమిలో చచ్చిన విధంగా, మాట్లాడకుండా నేలపై వ్రాలిపడ్డారు. కొంతమంది వెళ్ళలేక, చచ్చినవారిని ప్రక్కకు త్రోసి, తాము మెదలకుండా అక్కడ పడియున్నారు. కొందరు, చచ్చిన ఏనుగుల ప్రక్కన, పిరికితనంతో, దాగుకున్నారు. కొందరు తమ భార్యలను తలచుకొని, గట్టిగా ఏడ్చారు. కొందరు, పుట్టలపై పడియున్నారు. కొందరు, గడ్డిలో దూరి, కదలకుండా, ఉన్నారు.

కొంతమంది, తమ వ్రేళ్ళను చప్పరించారు. కొంతమంది వెన్నిచ్చారు. కొందరు తమ తలవెండుకలను విప్పి వాటిన జాడించారు. కొందరు, "మేము నీవారము" అంటూ నిలబడ్డారు. కొందరు తమ ఆయుధాలు క్రిందపడివేసి, భయపడ్డారు. కొంతమంది చతికిలపడి, క్రింద కూర్చున్నారు. కొంతమంది, యుద్ధంలో కూలిపడి, ప్రాణాలు వడలినా, తమ చేతిలోని ఖడ్గాలను మాత్రం వదలకుండా పట్టుకున్నారు. ఈ విధంగా యుద్ధరంగము, చూడడానికి భయాన్ని పుట్టించేదయి ఉంది.

...........